క్లుప్తంగా

సీపీని కలిసిన డీటీసీ



సీపీ అనురాధకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీటీసీ వేణు

సిద్దిపేటకమాన్: సిద్దిపేట నూతన డీటీసీగా బాధ్యతలు చేపట్టిన వేణు బుధవారం పోలీసు కమిషనర్ కార్యాలయంలో సీపీ అనురాధను మర్యాద పూర్వకంగా కలిశారు. రోడ్డు ప్రమాదాల నివారణపై అధికారులు చర్చించారు. రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సీపీ సూచించారు. సీపీని సిద్దిపేట సీఏఆర్ హెడ్ క్వార్టర్ బాధ్యతలు చేపట్టిన రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ విష్ణుప్రసాద్ కూడా కలిశారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రవీందర్

హుస్నాబాద్: హుస్నాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం కళాశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రథమ సంవత్సరం విద్యార్థినులు ద్వితీయ సంవత్సరం విద్యార్థినులకు వీడ్కోలు పలికారు. గత సంవత్సరం రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థినులను అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రవీందర్ మాట్లాడుతూ విద్యార్థినులు క్రమశిక్షణతో చదివి రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించాలన్నారు. అనంతరం తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కనకచంద్రం, బాలుర కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్ మహేష్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకటయ్య, అధ్యాపకులు సదానందం, కరుణాకర్, లక్ష్మయ్య, కవిత తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అందజేత



ఫోన్ అందజేస్తున్న ఎస్‌ఐ దామోదర్

చేర్యాల(సిద్దిపేట): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను నూతన సాంకేతిక సాయంతో స్వాధీనం చేసుకొని బాధితురాలికి అందజేసినట్లు ఎస్‌ఐ దామోదర్ బుధవారం తెలిపారు. మండల పరిధిలోని ముస్త్యాల గ్రామానికి చెందిన బూర్గు నవనీత తన సెల్‌ఫోన్ ఈనెల 14వ తేదీన పోగొట్టుకుంది. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా సెల్‌ఫోన్ గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన సెంట్రల్ ఎక్విప్ మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా తిరిగి పొందవచ్చన్నారు.

అగ్నికి హరితహారం మొక్కలు ఆహుతి



రోడ్డు పక్కన కాలిపోయిన మొక్కలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): హరితహారంలో నాటిన మొక్కలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. జగదేవ్‌పూర్ నుంచి మునిగడపకు వెళ్లే రోడ్డుకు ఇరువైపుల మొక్కలు నాటారు. అవగాహన లేక రైతులు పిచ్చిగడ్డిగా భావించి నిప్పు పెడుతున్నారు. అధికారులు స్పందించి రైతులకు అవగాహన కల్పించడంతో పాటు మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సరైన ప్రణాళికతో బస్సులు నడపాలి

హుస్నాబాద్: మేడారం జాతర బస్ సర్వీస్‌లను డిపో మేనేజర్ వెంకటేశ్వర్లతో కలిసి సీఐ కిరణ్, ఎస్సై మహేష్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా బస్సులను సరైన ప్రణాళికతో నడపాలన్నారు. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉన్నందున బస్సులను జాగ్రత్తగా నడపాలని డ్రైవర్లకు సూచించారు. పరిమితికి మించి బస్సులు నడపొద్దని హెచ్చరించారు. జాతర ముగిసే వరకు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

వన దేవతలకు వందనం

- గ్రామాల్లో సమ్మక్క-సారలమ్మ జాతర
- అమ్మవార్లను గద్దెలపై ప్రతిష్ఠించిన కోయ పూజారులు
- అమ్మవార్లకు బోనాలు, ఒడిబియ్యం సమర్పించిన భక్తులు



సారలమ్మను తీసుకెళ్తున్న కోయ పూజారులు

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండలం కూటిగల్ గ్రామంలో సమ్మక్క-సారలమ్మ జాతర మూడు రోజులు వైభవంగా జరుగుతుంది. జాతరలో భాగంగా బుధవారం మొదటి రోజు కోయ పూజారులు సారలమ్మను వనం నుంచి జనంలోకి డప్పు చప్పుళ్లతో తీసుకొచ్చారు. గ్రామ పంచాయతీ ఆవరణలో ప్రత్యేక పూజలు నిర్వహించి సమ్మక్క-సారలమ్మ గద్దెపై ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులు అమ్మవారికి పూజలు చేసి మొక్కలు సమర్పించారు. కార్యక్రమంలో జాతర కమిటీ చైర్మన్ శ్రీనివాస్, కమిటీ సభ్యులు, కోయ పూజారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని కిష్టాపూర్‌లో బుధవారం సమ్మక్క- సారలమ్మ జాతర వైభవంగా ప్రారంభమైంది. కోయ దొరలు సారలమ్మను గద్దెపైకి తెచ్చారు. అమ్మవారికి గ్రామస్తులు ఒడిబియ్యం సమర్పించారు.

నంగునూరు(సిద్దిపేట): అక్కెనపల్లిలోని సమ్మక్క, సారలమ్మ ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం గ్రామంలోని పోచమ్మ, మైసమ్మ, దుర్గమ్మ ఆలయాల్లో గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం పూజారి దాసరి శింగరయ్య సారలమ్మను గద్దెపై ప్రతిష్ఠించి పూజలు చేశారు.

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పొట్లపల్లి సమ్మక్క సారలమ్మ జాతర కోసం బుధవారం కంకవనాన్ని సిద్ధం చేశారు. రాత్రి సారలమ్మను కోయ పూజారులు గుట్ట నుంచి గద్దెకు తెచ్చి ప్రతిష్ఠించారు. గురువారం సమ్మక్క గద్దెకు చేరుతుందని, శుక్రవారం రాత్రి తల్లి అమ్మవార్లు వనంలోకి వెళ్తారని పూజారులు వివరించారు.



అక్కెనపల్లిలో పూజ కలశాలతో వస్తున్న పూజారి శింగరయ్య

నిర్మాణాలకు నిధులు మంజూరు



అసంపూర్తిగా నిలిచిపోయిన వెంకట్రావుపేట మినీ గోదాము

తొగుట(దుబ్బాక): మండలంలో అసంపూర్తిగా నిలిచిన భవనాలు పూర్తిచేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి కృషితో మండలానికి రూ 3.33 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో ఎస్డీఎఫ్ కింద రూ.2.28 కోట్లు, ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.1.05 కోట్లు ఉన్నాయి. ఈ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, కుల సంఘాల భవనాలు, ఆలయాలు, చర్చిలకు ప్రహరీ నిర్మాణంతో పాటు అసంపూర్తిగా నిలిచిపోయిన భవన నిర్మాణాల పనులు చేపట్టనున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ అతిథి గృహంతో పాటు వెంకట్రావుపేటలో మినీ గోదాము, ఘనపురంలో మహిళా భవనం, మండల ఐకేపీ భవనం, గుడికందులలో ఎస్సీ కమ్యూనిటీ భవనం అసంపూర్తిగా నిలిచిపోయాయి. గతంలో అప్పటి దుబ్బాక ఎమ్మెల్యే దివంగత చెరుకు ముత్యంరెడ్డి కృషితో గ్రామాల్లో భవనాలు నిర్మించారు. కొన్ని భవనాలు పూర్తికాగా మరి కొన్ని నిధులు చాలక నిర్మాణాలు నిలిచిపోయాయి. మంజూరైన నిధులతో మండల ఐకేపీ, వెంకట్రావుపేట మినీ గోదాం, గుడికందులలో ఎస్సీ కమ్యూనిటీ, ఘనపురంలో మహిళా భవనం పనులు చేపట్టనున్నారు.

పనులు ప్రారంభిస్తాం

మండల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ 3.33 కోట్లు మంజూరు చేసింది. మండలంలో అసంపూర్తి భవనాలతో పాటు కుల సంఘాల భవనాలు, సీసీ రోడ్లు, ఆలయాలకు ప్రహరీ నిర్మాణాలు చేపడతాం . ఇందుకు టెండర్ ప్రక్రియ పూర్తిచేసి పనులు ప్రారంభిస్తాం.

– రామకృష్ణారెడ్డి, ఏఈ పంచాయతీ రాజ్, తొగుట మండలం

ఘనంగా మాతృ భాషా దినోత్సవం



సిద్దిపేటలో బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని లక్ష్మీనగర్ గ్రామ పంచాయతీ మధిర గ్రామం ఆరెపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాతృభాషపై విద్యార్థులకు టీచర్లు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి, వలంటీర్లు స్వర్ణలత, లత, అంగన్‌వాడీ టీచర్ తార తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషల పాత్ర కీలకం

సిద్దిపేట ఎడ్యుకేషన్: ఉద్యమాల సమయంలో ఆయా మాతృభాషలు పోషించిన పాత్ర కీలకమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్) ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ అన్నారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం తెలుగు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులచే నిర్వహించిన చిత్ర ప్రదర్శన సాహిత్యాభిరుచిని పెంపొందిస్తుందన్నారు.

మాతృభాష సంస్కృతికి ఆయువుపట్టు

సిద్దిపేటరూరల్: సంస్కృతికి మాతృభాష ఆయువు పట్టు అని జక్కాపూర్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం పద్మ అన్నారు. బుధవారం పాఠశాలలో మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి ఒడి తొలి బడి అన్నారు. మాతృభాషలో పట్టు సాధిస్తే సంస్కృతి, సాంప్రదాయాలు మనుగడ సాధిస్తాయన్నారు.

గజ్వేల్‌రూరల్: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని బుధవారం పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ ఉమాశశి మాతృభాష విశిష్టతను తెలియజేశారు. ప్రపంచంలో ఆరు వేల భాషలున్నాయని, ఇందులో కొన్ని భాషలు అంతరించిపోతున్నాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం



దుండగులు ధ్వంసం చేసిన శిలాఫలకం

మిరుదొడ్డి(దుబ్బాక): ఇందిరా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించి 24 గంటలు గడవక ముందే గుర్తు తెలియని దుండగులు శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. ఈ సంఘటన మండల కేంద్రమైన మిరుదొడ్డిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం రాత్రి దివంగత ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహంతోపాటు శిలాఫలకాన్ని దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. అదేరోజు రాత్రి శిలాఫలకాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి చెత్తకుప్పలో పడేసి వెళ్లారు. ఈ విషయం బుధవారం దావానంలా వ్యాపించడంతో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మద్దెల రాజేష్ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న మిరుదొడ్డి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ధ్వంసం చేసిన శిలాఫలకాల ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా రాజేష్, పార్టీ సీనియర్ నాయకుడు నేరండ్ల భూమాగౌడ్, మండల నాయకుడు చెన్నై భూపాల్‌గౌడ్, మద్దెల సుదర్శన్ మాట్లాడారు. శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించడమే కాకుండా జిల్లాలో ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ఉండేందుకు సిద్దిపేట సీపీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

డిప్యూటీ తహసీల్దార్‌కు అదనపు బాధ్యతలు

సాక్షి ఎఫెక్ట్

కొండపాక(గజ్వేల్): కొండపాక మండల తహసీల్దార్‌గా బుధవారం ఒక్కరోజు మాత్రమే డిప్యూటీ తహసీల్దార్ నీలిమకు కలెక్టరు ప్రశాంత్ జీవన్ పాటిల్ అదనపు బాధ్యతలు అప్పగించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం రెవెన్యూ శాఖలో చేపట్టిన బదిలీల్లో భాగంగా ఈనెల 15వ తేదీన తహసీల్దార్ శ్రీనివాస్‌ను గజ్వేల్ తహసీల్దార్‌గా, గజ్వేల్ తహసీల్దార్ బాలరాజును కొండపాకకు బదిలీ చేశారు. కొండపాక నుంచి బదిలీపై వెళ్లిన శ్రీనివాస్ అదే రోజున గజ్వేల్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. కాగా గజ్వేల్ నుంచి బదిలీ అయిన బాలరాజు కొండపాక తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టలేదు. దీంతో ప్రజల ఇబ్బందులను సాక్షి దినపత్రిక రెండు రోజులుగా వరుస కథనాలను ప్రచురించింది. దీనికి స్పందించిన కలెక్టర్ బుధవారం ఒక్కరోజు మాత్రమే డిప్యూటీ తహసీల్దార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మాత్రమే కొనసాగింది.

బోధించారు.. అభినందించారు



మైలారంలో స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మైలారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఎంఈఓగా నిత్యశ్రీ, హెచ్‌ఎంగా సూరజ్, పలువురు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు.

నంగునూరు(సిద్దిపేట): స్వయంపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం నర్మేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈఓగా శివ కుమార్, ఎంఈఓగా శ్రీనివాస్, హెచ్‌ఎంగా వైష్ణవి, ఉపాధ్యాయులుగా అఖిల, శృతి, పూజ, వర్ష, అవినాష్‌రెడ్డి, మనోజ్, రాకేష్ వ్యవహరించారు. చక్కని బోధనతో ఆకట్టుకున్న విద్యార్థులను ఎంఈఓ దేశిరెడ్డి, హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

సిద్దిపేటఅర్బన్: మండలంలోని బక్రిచెప్యాల జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం స్వయంపాలన దినోత్సవాన్ని విద్యార్థులు నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు మిగతా తరగతుల విద్యార్థులకు పాఠాలు బోధించారు.

దౌల్తాబాద్(దుబ్బాక): మండల పరిధిలోని ముబారస్పూర్ జెడ్పీ పాఠశాలలో బుధవారం స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈఓగా అతీఫ్, ఎంఈఓగా అక్షయ, డీఐఈఓగా బన్నీ, హెచ్‌ఎంగా రెహాన్‌బాబా, ఉపాధ్యాయులుగా నందిక, కావ్య మధుప్రియ, అసీన్, ముస్కాన్ విధులు నిర్వహించారు.

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని జంగపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యా బోధన చేశారు.

కొండపాక(గజ్వేల్): మండలంలోని మర్పడ్గ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. డీఈఓగా సంరక్షణ్, డిప్యూటీ డీఈఓగా అభిషేక్, ఎంఈఓగా సుశాంత్, హెచ్‌ఎం మోక్షిత్, మరికొందరు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భూమయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బంగారులొద్ది తండాకు తాగునీరు

సాక్షి ఎఫెక్ట్

అక్కన్నపేట(హుస్నాబాద్): ఈనెల 18వ తేదీన తండాలో తాగునీటికి కటకట శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో బానోతు జయరాం, మిషన్ భగీరథ అధికారులు స్పందించారు. మండలంలోని రామవరం గ్రామ పంచాయతీ పరిధిలోని బంగారులొద్ది తండాకు సరఫరా అయ్యే పైపులను మరమ్మతులు చేసి వాటర్ ట్యాంకును నింపారు. తాగునీటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సాక్షికి తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు.

రాజ్యాంగంపై వ్యాస రచన పోటీలు

దుబ్బాకరూరల్: దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో మండలంలోని రాజక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు భారత రాజ్యాంగంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు భీమ్ శేఖర్ మాట్లాడుతూ రాజ్యాంగంపై ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మట్టిదందాకు చెక్

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలో కొనసాగుతున్న అక్రమ మట్టి దందాను అరికట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. బుధవారం ముద్దాపూర్, సింగారం, మేదినిపూర్ గ్రామాల శివార్లలో మల్లన్న సాగర్ నుంచి కొండపోచమ్మ రిజర్వాయర్, రంగనాయక్ సాగర్ రిజర్వాయర్లకు నీరు పారేందుకు వంద మీటర్ల వెడల్పుతో 5 ఏళ్ల కిందట కాలువను తవ్వారు. కాలువల తవ్వకంలో వచ్చిన మట్టిని భవిష్యత్ అవసరాల కోసం ప్రభుత్వం కాలువల పక్కన డంప్ చేసింది. ఈ మట్టిని అక్రమార్కులు అమ్ముకుంటున్నారు. ముద్దాపూర్ శివారులో మట్టిని జేసీబీతో టిప్పర్లలో లోడ్ చేస్తుండగా ఆర్ఐ సత్యనారాయణ పట్టుకున్నారు.

బహుజన రాజ్యం కోసం నిరంతర పోరాటం

ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్ మహారాజ్



నియామక పత్రాన్ని అందిస్తున్న రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్ మహారాజ్

దుబ్బాకటౌన్: బహుజన రాజ్యంకోసం ధర్మ సమాజ్‌పార్టీ నిరంతరం పోరాడుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్ మహారాజ్ అన్నారు. బుధవారం దుబ్బాకలో డీఎస్‌పీ దుబ్బాక మండల నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు రవిబాబు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హబ్సీపూర్‌కు చెందిన జోగు అనిల్, ఉపాధ్యక్షులుగా చిట్టిపాక కనకరాజు, ప్రధాన కార్యదర్శిగా అస్క ప్రవీణ్, కార్యదర్శిగా జాలిగామ స్వామి, కోశాధికారిగా కొమ్మాట ప్రభాకర్, మీడియా ఇన్‌చార్జిగా చింతల ఎల్లం మహారాజ్, కార్యవర్గ సభ్యులుగా మహేష్, సాయిని ఓటింగ్ పద్ధతిలో ఎన్నుకున్నారు. నూతన కమిటీకి నియామక పత్రాలను అందజేశారు.

సంక్షిప్త వార్తలు

◆ క్రీడా దుస్తుల పంపిణీ



చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మాచాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన ఏలేటి రాజిరెడ్డి రూ.40 వేల విలువగల క్రీడా దుస్తులు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలను చేరుకుని గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాబు, హెచ్‌ఎం దేవయ్య, టీచర్లు లక్ష్మారెడ్డి, దేవదాసు, మంజుల, లావణ్య పాల్గొన్నారు.

◆ సెలవు దినంగా ప్రకటించాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): సమ్మక్క, సారలమ్మ జాతరకు ప్రభుత్వం అధికారికంగా సెలవు దినంగా ప్రకటించాలని లంబాడ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు భూక్య కృష్ణనాయక్ బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద బంజారా గిరిజన జాతర దేశంలో రెండో కుంభమేళగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క, సారక్క జాతరను రాష్ట్ర ప్రభుత్వం 1996 నుంచి గుర్తించి అధికారికంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అమ్మవార్లను రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు తరలివచ్చి దర్శించుకుంటారని, ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని కోరారు.

◆ వక్ఫ్ బోర్డు చైర్మన్‌కు అభినందనలు



నంగునూరు(సిద్దిపేట): వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేన్‌ను హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసినట్లు నంగునూరు మండల మైనార్టీ నాయకుడు ఎండీ ఇమ్రాన్ బుధవారం తెలిపారు. నూతనంగా నియమితులైన సందర్భంగా ఆయనను కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు చెప్పారు. నంగునూరు మండలంలో వక్ఫ్ బోర్డు భూములు ఆక్రమణకు గురైన విషయం చైర్మన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

◆ భక్తులకు ఇబ్బందులు రాకుండా చూడాలి

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పొట్లపల్లి సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ మహేశ్ నిర్వాహకులకు సూచించారు. బుధవారం పొట్లపల్లి సమ్మక్క సారలమ్మ జాతర ప్రదేశాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు తాగునీరు, అమ్మవార్ల దర్శనం కోసం క్యూలైన్ ఏర్పాటుచేయాలన్నారు. ఎస్‌ఐ వెంట వైస్‌ఎంపీపీ దేవసాని నిర్మల తదితరులు ఉన్నారు.


◆ ఆలయాల నిర్మాణాలకు శంకుస్థాపన

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని గోనెపల్లిలో ఆంజనేయస్వామి, రామాలయం, షిరిడి సాయిబాబా దేవాలయాల నిర్మాణాలకు బుధవారం భూమి పూజ చేశారు. పూజా కార్యక్రమాల్లో వేదపండితుడు బాలశంకర శాస్త్రి, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు. ఆలయాల నిర్మాణాలకు దాతలు విరాళాలు అందజేస్తున్నారు.

◆ శాస్త్రీయ విజ్ఞానం అలవర్చుకోవాలి

సిద్దిపేటరూరల్: విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించుకోవాలని రూరల్ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీను అన్నారు. బుధవారం మండల పరిధిలోని రాఘవాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శాస్త్రీయ పరిజ్ఞానం, మూఢ నమ్మకాల నిర్మూలన, విద్య ఆవశ్యకత, మహిళల రక్షణ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ పరమేశ్వరీ, పోలీస్ సిబ్బంది రవిరాజ్, రాజు, ఇన్‌చార్జి హెచ్‌ఎం చంద్రమౌళి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

◆ డీఎస్‌పీ మండల కమిటీ ఎన్నిక



దీపక్

మిరుదొడ్డి(దుబ్బాక): ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్ మహారాజ్, జిల్లా అధ్యక్షుడు రవి బాబు సమక్షంలో బుధవారం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎర్రోల్ల దీపక్ (మిరుదొడ్డి)ను ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఎర్రోల్ల నవీన్, ఉపాధ్యక్షుడిగా డి.రవి, కోశాధికారిగా భూపాల్, మీడియా కార్యదర్శిగా డి.రాజేష్ ఎన్నికయ్యారు.